సర్కారు బడి.. డిజిటల్ బాట

- తోటగరువు హైస్కూల్‌లో ఐఎఫ్‌పీల ఏర్పాటు
- అందుబాటులోకి 32 స్మార్ట్‌టీవీలు



తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీ

ఆరిలోవ: సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడే సర్కారు బడులు ఇప్పుడు సకల వసతులతో కళకళలాడుతున్నాయి. కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన డిజిటల్ తరగతులు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చాయి. పాఠశాల స్థాయి నుంచే గుణాత్మక విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించారు. కొత్త భవనాలు, అదనపు గదుల నిర్మాణం చేపట్టడంతో పాటు డిజిటల్ విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ×ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్(ఐఎఫ్‌పీ–స్మార్ట్ టీవీ) ఏర్పాటు చేశారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నుంచే ఇవి అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ 32 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. వీటి ధర ఒక్కొక్కటి రూ 3.20 లక్షలు ఉంటుందని ఇక్కడ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ లెక్కన ప్రభుత్వం ఈ పాఠశాలలో ఐఎఫ్‌పీ టీవీలకు రూ.1.02 కోట్లు ఖర్చు చేసింది.

ఎంతో సులువు.. ఎన్నో ఉపయోగాలు

స్మార్ట్‌టీవీలను ఉపయోగించి బోధించడం ఉపాధ్యాయులకు చాలా సులువు. బ్లాక్ బోర్డు, సుద్ద ముక్కలు వినియోగానికి స్వస్తి పలికి స్మార్ట్ టీవీ, ఫ్లిప్ పెన్ ద్వారా బోధన జరుగుతుంది. ఉపాధ్యాయులకు సుద్ద ముక్క నుంచి వచ్చే దూలి ఉండదు, డస్టరుతో తుడవాల్సిన పనిలేదు. కేవలం ఫ్లిప్ పెన్‌తో గాని, ఏదైనా పెన్సిల్ వెనుక భాగంతో గాని ఈ టీవీ స్క్రీన్‌పై రాసుకోవచ్చు. దీనిలో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం వల్ల రాసిన పదాలు తరగతి గదిలో ఆఖరి బెంచీలో కూర్చొన్న విద్యార్థులకు కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఇదిలా ఉండగా దీనిలో పెన్ డ్రైవ్ ద్వారా డౌన్‌లోడు చేసుకొని ఉపాధ్యాయుడు పాఠాలు బోధించవచ్చు. దీనికి ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సదుపాయం ద్వారా పాఠ్యాంశాలను బోధించడంతో పాటు దేశం, రాష్ట్రంతో పాటు అంతర్జాతీయంగా ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు, గతంలో జరిగిన సంఘటనలు, విషయాలు గురించి విద్యార్థులకు విజువల్ ద్వారా చూపించే వీలు కల్పించారు.



తోటగరువు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్మార్ట్ టీవీ బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

గణిత బోధనకు ఉపయుక్తం



ఐఎఫ్‌పీలు గణిత బోధనకు ఉపయుక్తంగా ఉన్నాయి. దీని స్క్రీన్‌పై కొంత భాగంలో సూత్రాలు రాసుకోవచ్చు. పక్కనే ఆ సూత్రాన్ని ఉపయోగించి మ్యాథ్స్ బోధించవచ్చు. గతంలో నల్ల బోర్డుపై సుద్ద ముక్కలు ఉపయోగించి మ్యాథ్స్ చెప్పినప్పుడు దూలి కంటిలో సైతం పడి ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మ్యాథ్స్ చెప్పిన అనంతరం దీనిలో సేవ్ చేసుకోవచ్చు. మరుసటి రోజు అవసరమైతే మళ్లీ ఓపెన్ చేసి చూసుకునే అవకాశం ఉంది.

– కనకల సీతారాం
గణితశాస్త్ర ఉపాధ్యాయుడు, తోటగరువు

లెసన్ ప్లాన్ల ప్రదర్శనకు అవకాశం



ఉపాధ్యాయులు ఇంటి వద్ద తయారు చేసుకున్న లెసన్ ప్లాన్లను పెన్ డ్రైవ్‌లో తీసుకొచ్చి ఐఎఫ్‌పీలపై ప్రదర్శించుకోవచ్చు. ఆ లెసన్ ప్లాన్‌ను స్క్రీన్‌పై ఒక బాక్స్‌లో పెట్టుకుని విద్యార్థులకు సులువుగా పాఠం బోధించుకోవచ్చు. భౌతికశాస్త్రంలో పట్టికలను ఐఎఫ్‌పీలపై బోధనతో చక్కగా విద్యార్థులకు అర్థమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన డిజిటల్ బోధన బాగుంది.

– ఎ.స్వామినాయుడు,
భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, తోటగరువు

అన్ని తరగతుల్లోను ఐఎఫ్‌పీల ఏర్పాటు



తోటగరువు హైస్కూల్‌కు 32 ఐఎఫ్‌పీలు వచ్చాయి. వాటిని ప్రతి తరగతి గదిలోనూ ఏర్పాటు చేశాం. పాఠశాల పునః ప్రారంభం నాటికే ఇవి అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం నల్ల బోర్డులు, సుద్ద ముక్కలతో పనిలేదు. అయితే వీటిని ఉపయోగించడంలో ఉపాధ్యాయుడుకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలి. సామ్‌సంగ్ కంపెనీ ప్రతినిధులు వీటిని ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి ఒకటి, రెండు రోజుల్లో రానున్నారు. డిజిటల్ విద్యా బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– దుర్గాభవాని, హెచ్ఎం, తోటగరువు హైస్కూల్

సులువుగా అర్థమవుతున్నాయి..





ఉపాధ్యాయులు స్మార్ట్‌టీవీ ద్వారా పాఠాలు చెప్పినప్పుడు చాలా సులువుగా అర్థమవుతున్నాయి. టీవీ చూసుకొంటూ పాఠం వింటున్నట్లు ఉంది. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. జగనన్న విద్యా కానుక కిట్లు అందాయి.

– సురేఖ, తేజేశ్వరరావు, 9వ తరగతి, తోటగరువు హైస్కూల్

ఇండియన్ ఐడల్ విజేత సౌజన్యకు సన్మానం రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఐడల్ సీజన్–2 విజేత గాయని భాగవతుల సౌజన్యని బుధవారం సన్మానించనున్నామని అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ సత్కార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం నియామకం

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా నూతన కమిటీ నియామకాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా 11వ మహాసభల్లో భాగంగా అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు కార్యక్రమంలో ఏడుగురు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు 17మంది జిల్లా కౌన్సిల్ సభ్యులు నియమితులయ్యారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.అచ్యుతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా యు.రాగరాజు, రమణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.మధురెడ్డి, కోమర సందీప్, కోశాధికారిగా శివలను నియమించినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు తెలిపారు.

క్లుప్తంగా

హిందూ జ్ఞాన ధర్మ ప్రచారం



మద్దిలపాలెంలో హిందూ జ్ఞాన ధర్మ ప్రచారం చేస్తున్న సభ్యులు

మద్దిలపాలెం: త్రైత సిద్ధాంత ఆదికర్త, వేద ప్రదాత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో మద్దిలపాలెంలో సోమవారం హిందూ జ్ఞాన ధర్మ ప్రచారం నిర్వహించారు. యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని జ్ఞాన విజ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పైడన్న, శ్రీనివాస్, భవాని, భారతి, కె.రాజు, సంతోష్, లక్ష్మి, బంగారు తల్లి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆరిలోవ, విశాలాక్షినగర్‌లలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట సీపీఎం నాయకులు సోమవారం ధర్నా చేశారు. పెంచిన ధరలతో రూ.వేలల్లో బిల్లులు వచ్చాయని, వాటిని కట్టలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటిని వెంటనే రద్దు చేయలని కోరుతూ ఆయా స్టేషన్లలో విద్యుత్ విభాగం ఏఈలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు నరేంద్ర కుమార్, శంకరరావు, నాగరాజు, గౌరమ్మ, రమణ, సన్యాసమ్మ, అప్పారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



నైట్ షెల్టర్‌లో భోజనాలు వడ్డిస్తున్న 11వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆరిలోవ ముస్తఫా కాలనీలోని జీవీఎంసీ నైట్ షెల్టర్‌లో అనాథ వృద్ధులకు వైఎస్సార్‌సీపీ 11వ వార్డు నాయకులు అన్నదానం చేశారు. దీంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ వార్డు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.మోహనరావు, సూరిబాబు, శ్రీనివాస్, అప్పలరాజు, విజయలక్ష్మి, జమీ, సుజాత పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్‌లో..

ఎంవీపీ కాలనీ: మేయర్ గొలగాని హరివెంకట కుమారి జన్మదిన వేడుకలు లాసన్స్ బే కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాగుల పాఠశాలలో సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులకు సీట్లు, పండ్లు పంపిణీ చేశారు. గొలగాని కన్నారావు, తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీధర్, నూకరాజు, పీవీ రమణమూర్తి, కె.చిన్నారావు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

మద్దిలపాలెం : అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 –24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం www. braouonline. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం జగన్న విద్యా కానుక(జీవీకే) కిట్లు పంపిణీ చేశారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కలిసి విద్యార్థులకు ఈ కిట్లు అందజేశారు. అనంతరం ఇక్కడ దివీస్ కంపెనీ ఇటీవల ఏర్పాటు చేసిన మంచినీటి ఫిల్టర్‌ను విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. వాటిని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, పి.ఐ.బాలరాజు, పాపారావు, హుస్సేన్, అర్జున్, సూర్యారావు, బుజ్జి, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు



వలంటీర్లను సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా పని చేస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 15వ వార్డులోని వలంటీర్లను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు సారథ్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా అక్కరమాని పాల్గొని వలంటీర్లకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించి వలంటీర్లు సేవాతత్పరులుగా నిలిచారన్నారు. నిస్వార్థంగా అందిస్తున్న వారి సేవలకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో దళారుల వ్యవస్థకు చెక్ పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, సీవో నరసింహులు, బుగత ఏసురత్నం, ఆర్జి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితంలేని మహిళకు సపర్యలు



సపర్యలు చేయక ముందు అనాథ మహిళ



సపర్యలు చేసిన అనంతరం పరిశుభ్రంగా కనిపిస్తున్న అనాథ మహిళ

ఆరిలోవ: మతిస్థిమితం లేని ఓ అనాథ మహిళకు స్థానిక సేవా స్ఫూర్తి అసోసియేషన్ మహిళా సభ్యులు సపర్యలు చేసి తమ ఔదార్యం ప్రదర్శించారు. కొద్ది రోజులుగా జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్ బస్ స్టాప్ వద్ద ఓ అనాథ మహిళ ఉంటోంది. ఆమెకు సేవా స్ఫూర్తి అసోసియేషన్ మహిళా సభ్యులు రోజూ ఆహారం, మంచినీరు అందించేవారు. దుస్తులు మార్చుకోకపోవడం, స్నానం చేయకపోవడంతో రోజురోజుకూ ఆమె పరిస్థితి అధ్వానంగా మారుతోంది. దీన్ని గమనించిన సేవా స్ఫూర్తి మహిళలు సోమవారం ఆమెకు స్నానం చేయించి ఉతికిన దుస్తులు వేశారు. తల దువ్వి జడ వేసి, బొట్టూ కాటుక పెట్టి తయారు చేశారు. మానవతా దృక్పథంతో అనాథ మహిళకు సపర్యలు చేసిన అసోసియేషన్ మహిళలు అనిత, పార్వతి, వేణు, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, అనూష, వెంకటలక్ష్మిలను స్థానికులు అభినందించారు.

గిరిప్రదక్షిణ రహదారికి గ్రీన్ సిగ్నల్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: 60 అడుగుల గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ అధికారులు సోమవారం ఈ రోడ్డును పరిశీలించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో మారియట్ హోటల్ నుంచి సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు 60 అడుగుల రోడ్డు విస్తీర్ణం చేయనున్నారని, అందులో భాగంగా మారియట్ హోటల్ నుంచి 51వ వార్డు బౌండరీ వరకు సుమారు రూ.5 కోట్లు మంజూరయ్యాయని కార్పొరేటర్ చెప్పారు. ఈ నేపథ్యంలో డీఈ వర్మ, ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ గుప్తా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి కలిసి రోడ్డును పరిశీలించారు. వచ్చే నెలలో గిరిప్రదక్షిణ పూర్తయిన అనంతరం రోడ్డు విస్తీర్ణ పనులు మొదలుపెడతారని తెలిపారు. ఈ రహదారికి విభాగిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ సూచించారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, పార్టీ నాయకులు రమేష్, శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న అనూజ్‌కాజ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్ ఫెస్టివల్‌లో రెండో రోజు సోమవారం నిర్వహించిన కచేరీలో నేటి తరానికి చెందిన అనూజ్‌కాజ శ్రావ్యంగా గాత్ర కచేరీ చేశారు. అనంతరం ఇవటూరి కృష్ణ శృతి గాత్రంతో అందర్నీ అలరించారు. వయోలిన్ సహకారం ఎ.వి.కె.ఆదిత్య, ఎస్.కృష్ణప్రియ, మృదంగ సహకారం ఆర్.పీథం, జి.సాయి చరణ్ అందించారు.

స్టీలు పల్లాలు వితరణ



మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డికి పల్లాలు అందిస్తున్న శ్రీరాంప్రసాద్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి ఎంవీపీ కాలనీకి చెందిన కె.శ్రీరాం ప్రసాద్ స్టీలు పల్లాలు అందజేశారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డికి కార్యాలయంలో వీటిని అందించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వీటిని వినియోగించాలని దాత కోరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఆస్పత్రి తరఫున డాక్టర్ రామిరెడ్డి అభినందించారు.

సైకిల్‌పై జీవీఎంసీకి కమిషనర్



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకై జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం తిరిగి సైకిల్‌పైనే బంగ్లాకు వెళ్లారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒక రోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

సినీ ఆర్టిస్టులకు హెల్త్‌కార్డుల పంపిణీ



సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సభ్యులకు హెల్త్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పలువురు సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలి రావాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్‌నాయుడు, మురళీ, వర్మ, సురేష్, జేటీ రామారావు, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక అభ్యున్నతి

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 18వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–7 పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అవ్వాతాతలకు పెన్షన్ పెంచుతూనే, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన వంటి చారిత్రాత్మక పథకాలతో ప్రతి ఇంటా అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. ప్రజలకు వైద్యం, విద్యా, పక్కా ఇళ్లు చేరువ చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్న సన్నిధిలో మేయర్ గొలగాని



తిరుమల శ్రీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో మేయర్ హరి వెంకటకుమారి దంపతులు

డాబాగార్డెన్స్: విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి దయతో జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వెంకన్నస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు ఆమె చెప్పారు.

– మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జన్మదిన వేడుకలను సోమవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ 11వ వార్డులో కార్పొరేటర్ శంకర్‌రెడ్డి నేతృత్వంలో కార్పొరేటర్లు తిరుమలరెడ్డి, మహేష్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు తిరుపతిలో కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా జాతీయ రీడింగ్ దినోత్సవం



ఏయూ ఆచార్యులు సోమశేఖర్‌ను సత్కరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం : జాతీయ రీడింగ్ దినోత్సవాన్ని మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ విశ్రాంత ఆచార్యుడు కె.సోమశేఖర్ మాట్లాడుతూ చదవడం విశిష్టత, అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.రవిబాబు, సిహెచ్.లలిత, శ్రీవాణి, సిహెచ్.విష్ణుమూర్తి, పోలా ఉమామహేశ్వరరావు, సుధీర్, ఎస్.శారదా, తదితరులు పాల్గొన్నారు.